

# అమెరి "కలగూరగంప" కామెడి

## వంగూరి చిట్టెన్‌రాజు



## మరో మహాసభలూ - మరికొన్ని మహానందాలూ

19

**కిందటి నెల జరిగిన అమెరికా మహాసభలలో** కొట్టొచ్చినట్టుగా కనపడిన విషయం ఏమిటంటే....ఎంత విరాళం ఇస్తే అంత ఘనంగా సన్మానం పొందవచ్చునోచ్ అనేది ఒకటీ. ఎప్పటిలాగానే, సాహిత్యం గాళ్ళకి ఎంత విజ్ఞానధనం ఉన్నా ఏదో చారులో కరివేపాకులే అని ఆట్టే ఆర్భాటాం లేకుండా శాలువా కప్పేసి చెక్క ముక్క చేతిలో పెడతారూ అనేది మరొకటీ. ఇక పెద్ద తెర, చిన్న తెరమీద వెలుగొందుతున్న ఘోర నటులు చేసిన "హాస్య" నాటికలు చూసి "నవ్వ" లేక చచ్చాం...అంటే అవి నిజంగా హాస్యంగా ఉండబట్టి కాదు...అవి చూసి నవ్వా లేక, ఏడవా లేక చచ్చాం అనమాట ఆ కార్యక్రమాలకి. ఒకే ఒక్క సినిమాతో సెలెబ్రెటీ అయిపోయి రికార్డింగ్ డాన్సులు చేసి అమెరికా తెలుగు వారిని తరింప చేసిన బృందం సుమారు నలభై మందికీ కనీసం లక్ష డాలర్లు ఖర్చు అయిఉంటుంది. అలాగే ముగ్గురు సంగీత దర్శకులు, వారితో బాటు అరడజను మంది యువ గాయక గాయనీ మణులూ, పది మంది వాద్యగాళ్ళకీ మరొక లక్ష డాలర్లు అయిఉంటుంది. అంటే ఈ మహా సభలకి ఇద్దరు మహా దాతలు ఇచ్చిన విరాళాలు ఈ ఖర్చులకే సరిపోయాయి కాబట్టి ఇక సాహిత్యానికి పదివేలు మిగిలాయి. అందులోనే ఒక అష్టావధానం, ఇండియా నుంచీ, అమెరికా నుంచీ పదిమంది సాహితీవేత్తలని రప్పించి, పారితోషికాలూ, దారి ఖర్చులూ ఇచ్చి, మా వంతు శాలువాలూ, చెక్క ముక్కల్లూ కూడా ఇచ్చి సత్కరించాం.

అన్నింటిలోకీ హాస్య ప్రసంగం ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు బాలయ్యగారు చేశారు. ఆ స్పీచ్ ఎవరు రాసిచ్చారో తెలియదు కానీ...మొత్తం తెలుగు సాహిత్య చరిత్ర, రాజకీయ చారిత్ర, ఎన్‌టీఆర్ గొప్పతనం, ఎన్నారైల ప్రత్యేకత ఒకటేమిటి ఈ చరాచర భూప్రపంచంలోని అన్ని తెలుగు విషయాలూ కూలంకషంగా ఇరవై నిముషాలలో చెప్పి అందరినీ నవ్వించారు. అందులో పరాకాష్ట మధ్యలో ఆ ఆవేశంలో "ఆ నాడు కాల్చరా, కాల్చు అని తెల్ల వాడి ముందు గుండీలు విప్పి, గుండును..కాదు, కాదు గుండెని చూపించిన మన ఆంధ్ర కేసరి .." అని ఆ ఆవేశంలో ఆ ఆంధ్ర కేసరి పేరు మర్చిపోయారు ప్రధాన వక్త గారు. కనీసం ఐదు నిముషాలు నిశ్శబ్ద వాతావరణంలో, ప్రేక్షకులు ఈ గుండె, గుండు గండం నుంచి ఈయన ఎలా గట్టెక్కుతాడా అని ఉత్కంఠ భరితంగా ఎదురు చూస్తుండగా ఆయన ఎంతో సమయ స్ఫూర్తితో మొత్తం ఉపన్యాసం మొదటి నుంచీ మొదలు పెట్టారు..మనం చిన్నప్పుడు ఎక్కాలు బట్టీ బట్టి అప్పజెప్పిమట్టుగానే...ఈ లోపుగా స్టేజ్ మీద ఉన్న దాతలందరూ కూడబలుక్కుని ..ఆంధ్ర కేసరి ఎవరో అని తర్జన భర్జన పడి, వారి ఐఫోన్‌లో గూగుల్ చేసి సమాధానం తెలుసుకున్నారు. వెనువెంటనే ఆ దాతల ప్రతినిధి ఒకాయన బాలకృష్ణ దగరకి వెళ్ళి, భుజం మీద చెయ్యేసి, భరోసా ఇస్తూ అది ఖచ్చితంగా టంగుటూరి ప్రకాశం పంతులే అని తమ సామూహిక నిర్ణయాన్ని ఆయన చెవిలో ఊదారు. అప్పటికే మళ్ళీ మొదలు పెట్టిన ఉపన్యాసం మధ్యలో ఉన్న ప్రధాన అతిథి గారు ఆ క్షణంలో కృష్ణదేవరాయలు అనబోతూ,

నాలిక్కరుచుకుని, ఈ శుభ వార్త చెవిలో ఊదిన ఆయనకి "థేంక్యూ" చెప్పి "ఆ నాటి టంగుటూరి ప్రకాశం పంతులు గారి భువన విజయంలో అలసాని పెద్దన, తెనాలి రామకృష్ణ కవీంద్రుల వారు మన సాహిత్యానికి తెల్ల జండా ఊపారు" అని ఉపన్యాసం కొనసాగించి, అందరినీ నవ్వించి, తెలుగు వారంటే గర్వపడేలా చేశారు.

ఇక కీలకోపన్యాసకులిగా వచ్చిన వారు జొన్నవిత్తుల వారు. అసలు ఈ కీలకోపన్యాసం మొదటి రోజు ప్రారంభ సభలో జరగవలసినది. కానీ, అలా, అలా జరుపుకుంటూ పోయి, అఖరికి సాయంత్రం భోజనాలయ్యాక ఏర్పాటు చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యా విధానాల వలన తెలుగు భాష మరుగున పడిపోతోంది కాబట్టి మీ ఎన్నారైలందరూ ఉద్యమించి, గవర్నమెంట్ వారికి వేల కొద్దీ ఈ మెయిల్స్ పంపించి వారిని నిద్ర లేపండి అని ఆయన సందేశం ఇచ్చారు. అదే విషయం మీద గత మార్చ్‌లో జరిగిన మూడవ ప్రపంచ సాహితీ సదస్సులో చేసిన తీర్మానాన్ని  ముఖ్య మంత్రికీ, మంత్రివర్యులకీ, శాసన సభ్యులకీ నేను పంపించి అప్పుడే మూడు నెలలు అయింది. ఆ నలుగు వందల మందిలో ఏ ఒక్కరి దగ్గరి నుండీ నాకు సమాధానం రాకపోవడం ఒక కారణం అయితే, వారిని నిద్ర లేపమనే ఈ సందేశాన్ని ఇప్పుడు విని, నేను పొరపాటున వాళ్ళందరికీ జోల పాట పాడేశానేమో అని అనుమానం వేస్తోంది.

ఇక అవధానం కార్యక్రమానికి వస్తే , ఎందుకో తెలియదు కానీ నేను ఇది వరలో మరొక తంటా సంఘంలో కూడా అదే అవస్థ పడవలసి వచ్చింది. అదేమిటంటే, సాధారణంగా అవధానం రెండో రోజున ఉదయం తొమ్మిది గంటలకి పెడతారు. అదే రోజు సాయంత్రం ఇండియానుంచి సినీ గాయకుల ప్రోగ్రాం ఉంటుంది. కానీ వాళ్ళు కీ బోర్డూ, గిటారూ, డప్పులూ మొదలైన వాయిద్యాలన్నింటినీ ట్యూన్ చేసుకోడానికి కావలసిన గంటన్నరా సాయంత్రం కుదరదు కాబట్టి, పొద్దుట అవధానం ముందు కేటాయిస్తారు. ఇక అవధానులూ, పృచ్ఛకులూ, ప్రేక్షకులూ అందరూ తొమ్మిది లోపుగా వచ్చినా, స్టేజ్ మీద ఈ సినిమా వారి ట్యూనింగ్ విభావరి జరుగుతూ ఉంటుంది. ఇది వరకటి సభలో "ఆరేసుకోబోయి, పారేసుకున్నా" పాట కరెక్ట్‌గా ట్యూనింగ్ అవగానే హమ్మయ్య అని ఆ సంగీత దర్శకుడు మాకు స్టేజ్ అప్పగించగానే మేము అయ్యయ్యో సరస్వతీ ప్రార్థనతో మొదలుపెట్ట వలసిన అవధానానికి నాందీ ప్రస్తావన ఇలా ఆరేసుకుని, పారేసుకోవలసి వచ్చిందే అనుకున్నాం. ఈ సారి అంతకంటే "ఉన్నత స్థాయి" లోనే మా అవధానం మొదలయ్యింది....ఆ పాట పేరు "కెవ్వు కేక"...ఈ కెవ్వు కేక ఈ మహా సభలలో కనీసం పది మంది అరిచారు. అరడజను సార్లు డాన్స్ చేశారు. అదృష్టం బావుండక నేనూ, మా క్వీన్ విక్టోరియా ఆ గబ్బర్ సింగ్ సినిమా చూశాం. చూస్తున్నంత సేపూ మా ఆవిడ కెవ్వున కేకలు పెడుతూనే ఉంది "ఇంటికి పోదాం" "ఇక భరించ లేను" అంటూ. నేను మటుకు "మనిషికి పదిహేను డాలర్లు పెట్టి టిక్కెట్టు కొన్నాను, సినిమా పూర్తిగా చూశి తీరతాను" అని మొండి కేశాను. వెధవ సినిమాలు తెలుగు వారు ఎంత గొప్పగా తియ్యగలరో, అవి ఎంత మంది చూసి హిట్ చెయ్యగలరో తెలుసుకోడానికి ఈ సినిమా ఒక ఉదాహరణ. ఆ సినిమా లోదే ఈ కెవ్వు కేక. మా అవధానిగారికీ, పృచ్ఛకులకీ నచ్చలేదేమో కానీ, నాకు ఈ పాటలో సాహిత్యం విలువలు బాగా నచ్చాయి. ఉదాహరణకి "నా ఈడు కొత్తిమీర, నా సోకు కోడి కూర", దీని తస్సదియ్యా, కెవ్వు కేక, నా సామిరంగ కెవ్వు కేక", "నా బుగ్గలోని మెరుపులతో  అగ్గిపుల్ల రాజేసి, నీ బీడీ వెలిగిస్తే, నీ దుంప తెగ, కెవ్వు కేక"..ఇలాంటి అద్భుతమైన పద ప్రయోగాలు ఏ అవధాని మటుకు చెయ్యగలరు చెప్పండి.

ఈ అవధానంలో కూడా నేనే యధాప్రకారం "అప్రస్తుత ప్రసంగం" చేశాను. యధాప్రకారం అంటే, బాగానే చేశాను అని అర్థం అని అందరికీ అర్థం అయే ఉంటుంది. ఇందులో నేను అడిగిన ఒక ప్రశ్న "అవధాని గారూ, కక్కొచ్చినా, కళ్యాణం వచ్చినా ఆగదంటారు కదా!. అంటే అమెరికాలో కక్కొచ్చేదాక కళ్యాణం చెయ్యకూడదా" అని అడిగాను. ఆయన నా అజ్ఞానానికి చింతించి "అసలు సామెత దానికి రివర్స్ పెద్దాయనా...కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా అనే కానీ, మీ అమెరికా వాళ్ళలాగా " కాదు" అని తిప్పికొట్టారు.

ఇక మేము వేసిన నాటకం "గగనంలో గందర గోళం". దీన్ని మా ఊళ్ళో ఔత్సాహిక నటులూ, నటీమణులూ కలిసి రాసుకున్నారు. నాటకాలంటే  నాకు పిచ్చి కాబట్టి, ఏదో సహాయం చేసే పేరుతో నేనూ వాళ్ళలో దూరి పోయి...దర్శకుడిగా సెటిల్

అయిపోయాను. ఈ డ్రామా బాగానే పండింది కానీ, ప్రేక్షకులలో చాలామంది నిర్ధాక్షిణ్యంగా నవ్వ వలసిన చోట కూడా మూతులు బిగించుకుని కూచున్నారు అనిపించింది నాకు. అలాగే ఎనభై ఏళ్ళ తెలుగు సినిమా పాట అనే కార్యక్రమం రెండు రోజులూ అమెరికా నలుమూలల్నుంఛి వచ్చిన గాయనీ గాయకులతో బాగా జరిగింది. కానీ ఆ హాలు మరీ పెద్దది అవడంతో అప్పుడప్పుడు ఆడియన్స్ పల్చగా కనిపించారు. అదే చిన్న హాల్లో జరిగిన తెలుగు సినిమా పాటలలో సాహిత్యం కార్యక్రమానికి నటుడు రాజేంద్ర ప్రసాద్, లయ, జొన్నవిత్తుల, వడ్డేపల్లి, అశోక్ తేజ మొదలైన ప్రముఖులు రావడంతో నిండుగా, మెండుగా జరిగింది.

అన్నట్టు, రామాయణంలో పిడకల వేటలాగా, ఈ మూడు రోజుల తతంగంలోనూ నాకు రెండు సన్మానాలు జరిగాయి. ఒకటేమో మొదటి రోజు రాత్రి బేంక్వెట్‌లో సాహిత్య సన్మానం. సాహిత్యం డిపార్ట్‌మెంట్‌లో ఎవరో ఒకరికి శాలువా కప్పకపోతే కొంప ములుగుతుందేమో అనుకుని మహాసభల నిర్వాహకులు అనుకుని ప్రకటించినా, దానికి ఎవరూ స్పందించకపోతే, ఇక గత్యంతరం లేక నన్ను ఎన్నుకున్నారేమో అని నా అనుమానం. ఏది ఏమైనా  ఈ  సన్మానాలు జరిగిన తీరు తమాషాగా ఉంది. దాన్నే "శాలువాల పంపిణీ కార్యక్రమం" అనవచ్చు. నా విషయంలో మటుకు చాలా గౌరవం చేశారనే అనుకుంటున్నాను. ఎందుకంటే, నా కంటే ముందు జరిగిన ఐదు సన్మానాలూ నిర్వాహకులలో పెద్దలు చేశారు. వెనువెంటనే వాళ్ళందరినీ స్టేజ్ మీద నుంచి దింపేసి, ఖాళీ చేసేసి, సినీ నటులు, ప్రధాన అతిథులు బాలకృష్ణ మరియు రాజేంద్ర ప్రసాద్‌నీ స్టేజ్ మీదకి ఆహ్వానించారు. ఆ తరువాత ఒకాయన నా గురించి పొగిడి అవతలపారేస్తూ నన్ను సన్మాన గ్రహీతగా స్టేజ్ మీదకి ఆహ్వానించారు. ఇదేదో బాగానే ఉంది సుమా అనుకుంటూ ఉండగా...బాలయ్య గారు "మీరు హాస్యం రాస్తారుట కదా" అని అడిగారు. నేను మొహం ఎలాపెట్టాలో తెలియకుండా ఉండే మొహం పెట్టగానే "అవును, ఆయనకి హాస్యం రాయడం మాత్రమే వచ్చును" అని రాజేంద్ర ప్రసాద్ బాలయ్య గారికి చెప్పారు. నేను మళ్ళీ మొహం ఏ విధముగా పెట్టవలెనో తెలియక అదే విధంగా మొహం పెట్టగానే బాలయ్య గారు "అయితే మీకు ఈ జోకు చెప్పాలి" అని రెండు వేల మంది సమక్షంలో, మైకులో ఇందాకటి ఒకాయన ఇంకా నా గురించి మూడో పేరా చదువుతూండగానే కనీసం ఐదు నిముషాలు ఒక జోకు చెప్పారు. అసలు మామూలుగానే ఆయన డైలాగులు అర్థం అవని నాకు ఆ ప్రత్యేక మానసిక పరిస్థితిలో ఆయన జోకు అక్షరం ముక్క కూడా అర్థం అవకపోయినా నవ్వు మొహం పెట్టి ఆయన్ని సంతోషపెట్టాను. ఈ లోపుగా ఇందాకా చెప్పిన ఒకాయన నా గురించి ఐదో పేరాగ్రాఫ్ చదివేయడం, నాకు శాలువా కప్పే టైమూ, చెక్క ముక్క ఇచ్చే టైంలో నా తరవాత అవార్డు పుచ్చుకునే మరొక బహుమతి గ్రహీతగారి తాలూకు రెండో పేరాగ్రాఫ్ మరొక ఆయన చదువుతూ ఉండడం..ఈ సన్మాన కమిటీ చైర్మన్ గారు....తరువాత అవార్డు పుచ్చుకునే నలుగురూ స్టేజ్ మీదకి రావలసినదోచ్ అని ఆంగ్లంలో పదే, పదే ప్రకటిస్తూ ఉండడం...ఇన్ని రణ గొణ ధ్వనుల మధ్య  ఏమీ పట్టించుకోకుండా నేను రాజేంద్రప్రసాద్ దగ్గర పతకమూ, బాలయ్య దగ్గర శాలువా లాక్కుని బయట పడ్డాను. ఇలా కాకుండా ముప్ఫై మంది ఉన్న మరొక గదిలో ఆంధ్రా యూనివర్శిటీ పూర్వ విద్యార్థుల సంఘం వారు నన్ను **"Distinguished Alumni"** గుర్తిస్తూ మరొక శాలువా కప్పారు.

***"వచ్చే నెల మన అమ్మాయి పెళ్ళి కదా...బూడిదగుమ్మడి వడియాలు పెట్టుకోడానికి ఈ శాలువాలు బాగా పనికొస్తాయి". అని మా క్వీన్ విక్టోరియా సంతోషపడింది.***

●●●

Post your comments